www.netifocusnews.com

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

శుక్రవారం 5, డిసెంబర్ 2025 | వెల: రూ.4/- | సంపుటి: 01 | సంచిక: 40 | పేజీలు: 04

Published From: Hyderabad | Editor: Mankali Tharun

## మంచి అభ్యర్థినే సర్పంచ్‌గా
# గెలిపించుకోండి

- అవసరమైతే సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోండి
- ప్రత్యేక రాష్ట్రం వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయి అనుకుంటే ఓ పెద్దాయన దెయ్యమై పట్టారు..
- కాళేశ్వరంతో లక్ష కోట్లు గోదారిపాలు
- ఆదిలాబాద్‌లో ప్రజాపాలన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రూ.260 కోట్లతో అభివృద్ధి పనులు

2





# తొలి విడత ఎన్నికల బరిలో 13,127మంది అభ్యర్థులు

- మొత్తం 395 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం
- మిగిలిన 3,836 స్థానాలకు 11న పోలింగ్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబరు 4:

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత ఎన్నికల్లో పోటీ పడుతున్న అభ్యర్థుల లెక్క తేలింది. ఎన్నికల అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం.. తొలి విడతలో ఎన్నికల జరగనున్న 4,236 సర్పంచ్ స్థానాల్లో 395 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని 26 స్థానాలు ఉన్నాయి. ఈ 26 మందిలో 25 మంది కాంగ్రెస్ మద్దతుదారులు కాగా ఒకరు టీడీపీకి చెందిన వారు. కాగా, తొలి విడత ఎన్నికలకు సంబంధించి ఓ ఐదు గ్రామాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. దీంతో మిగిలిన 3,836 సర్పంచ్ స్థానాలకు ఈ నెల 11న ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం తొలి విడత కోసం 25,654 మంది నామినేషన్లు దాఖలు చేయగా 8,095మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పలువురి నామినేషన్లు అనర్హతకు గురయ్యాయి. 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. చివరిగా 13,127మంది అభ్యర్థులు తొలి విడత ఎన్నికల బరిలో మిగిలారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఒక్కో సర్పంచ్ స్థానానికి ఆరుగురు పోటీలో ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య నలుగురికి తగ్గింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం, నెల్లివెంకటాపూర్, ఉందూరుగూడ గ్రామ పంచాయతీలు, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని తేజాపూర్., నిర్మల్‌జిల్లా దస్తూబాద్ మండలం పెర్కపల్లి పంచాయతీల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. రిజర్వేషన్లు సరిగాలేవని, ఇతర కారణాలు చూపుతూ ఒక్క నామినేషన్ కూడా వేయకుండా ఆ గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. తొలి విడత ఎన్నికల్లో 37,440 వార్డు సభ్యుల స్థానాల కుఎన్నికలు జరగాల్సి ఉండగా వాటిల్లోని 9,331స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలోని 5గ్రామాలతోపాటు మరికొన్నిచోట్ల రిజర్వేషన్లు, ఇతర కారణాలతో 149 స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. మిగిలిన 27,960వార్డు సభ్యుల స్థానాలకు67,893 మంది బరిలో నిలిచారు.

# ఎన్నికల్లో జోక్యం చేసుకోలేం

- జనాభా లేకున్నా కొన్ని చోట్ల రిజర్వేషన్ల కేటాయింపు
- పిటిషనర్లు పేర్కొన్న అంశాల్లోనూ వాస్తవాలున్నాయ్
- నోటిఫికేషన్ వచ్చాక ఎన్నికలు ఆపలేం: హైకోర్టు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబరు 4:

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిందని, ఒకసారి ఆ ప్రకటన వచ్చిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 234(ఓ) ప్రకారం.. నోటిఫికేషన్ విడుదలయ్యాక న్యాయస్థానాలు కల్పించుకోలేవని.. అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. పిటిషనర్ల వాదనల్లో విషయం ఉన్నా.. నోటిఫికేషన్‌కు ముందు లేదా ఎన్నికలు పూర్తయిన తర్వాత మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోగలవని వెల్లడించింది. కనీస జనాభాను పరిగణనలోకి తీసుకోకుండా సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు రిజర్వేషన్లను కేటాయించిన రాష్ట్ర ఎన్నికల తీరు సరిగా లేదని హైకోర్టు తప్పుబట్టింది. ఎన్నికలు పూర్తయ్యాక సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా మిగిలిపోతే ప్రభుత్వంతో సంప్రదించి వీలైనంత త్వరగా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఈసీకి ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు పిటిషన్ల విచారణను ముగిస్తున్నట్లు పేర్కొంది. వరంగల్ జిల్లా మహమూద్‌పట్నం పంచాయతీలో ఆరుగురు ఓటర్లు మాత్రమే ఉన్నప్పటికీ.. సర్పంచ్ పదవితో పాటు మూడు వార్డులను ఎస్టీలకు రిజర్వ్ చేయడాన్ని సవాల్ చేస్తూ గ్రామస్థులు హైకోర్టులో పిటిషన్ వేశారు. మరికొన్ని గ్రామాలకు సంబంధించి ఇలాంటి మరో నాలుగు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ చలపతిరావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఎన్నికలు నిలిపివేయాలని తాము కోరడం లేదని.. రిజర్వేషన్ల ప్రక్రియను కొన్ని ప్రాంతాల్లో మార్చాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈసీ నిర్ణయంతో ఎన్నికలు జరిగే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ఒక ఊరిలో రిజర్వేషన్ వచ్చిన వర్గానికి చెందిన వారు ఒక్కరే ఉన్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 2011 నాటి జనాభా లెక్కలను ఈసీ పరిగణనలోకి తీసుకోవడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లోనే రాష్ట్రం విడిపోయిందని, అయినా 14ఏళ్ల క్రితం జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుంటే ఎలా..? అని ప్రశ్నించారు. ఎస్ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయించామని.. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 2011 జనాభా లెక్కలు తప్ప వేరే లెక్కలు తీసుకోవడానికి ఆస్కారమే లేదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. రిజర్వేషన్ వచ్చిన వర్గం జనాభా లేకపోతే.. ఎన్నికలు నిలిచిపోయిన చోట వెంటనే ఎన్నికలు పెట్టాలని తెలిపింది. ముందస్తుగానే రిజర్వేషన్లు సరిగా కేటాయించాల్సి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల వాదనలో విషయం ఉన్నా.. ఇలా పిటిషన్లు అనుమతిస్తూ పోతే ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకాదని తేల్చి చెప్పింది.

# గ్లోబల్ సమ్మిట్‌లో కీరవాణి కచేరి

- 90 నిమిషాల పాటు ప్రత్యేక సంగీత కార్యక్రమం
- జయలక్ష్మి వీణా కార్యక్రమం, కళాకృష్ణ పేరిణి ప్రదర్శన
- 10-13 తేదీల్లో రోజంతా మ్యూజికల్ ఆర్కెస్ట్రా

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబరు 4:

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనే దేశ, విదేశీ ప్రతినిధులను తెలంగాణ సాంస్కృతిక కళారూపాలు అలరించనున్నాయి. ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి తన బృందంతో 90 నిమిషాల సంగీత కచేరీ అలరించనుంది. ప్రముఖ వీణా విద్యాంసురాలు పి.జయలక్ష్మి వీణా కార్యక్రమం, కళా కృష్ణ ఆధ్వర్యంలో పేరిణి నాట్యం అతిథులను ఆకట్టుకోనున్నాయి. ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు సామల వేణు ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. వీటితోపాటు తెలంగాణ సంప్రదాయ కళారూపాలు ఆహుతులను అలరించనున్నాయి. కొమ్ముకోయ, బంజారా, కోలాటం, గుస్సాడి, ఒగ్గుడోలు, మహిళల డప్పులు, పేరణి నృత్యం, బోనాల కోలాటం వంటి ప్రజా కళారూపాలతో అతిఉథులకు ఆహ్వానం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సమ్మిట్ డిసెంబరు 8 నుంచి ప్రారంభమవుతుండగా 10 నుంచి 13వ తేదీ వరకు ఈ వేడుకలను ప్రజలు కూడా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ నాలుగు రోజుల పాటు రోజంతా మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తారు.

## మంచి అభ్యర్థినే సర్పంచ్‌గా

# గెలిపించుకోండి

- అవసరమైతే సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోండి
- ప్రత్యేక రాష్ట్రం వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయి అనుకుంటే ఓ పెద్దాయన దెయ్యమై పట్టారు..
- కాళేశ్వరంతో లక్ష కోట్లు గోదారిపాలు
- ఆదిలాబాద్‌లో ప్రజాపాలన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రూ.260 కోట్లతో అభివృద్ధి పనులు









ఆదిలాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబరు 4:

నోరు మంచిదైతే ఊరంతా చుట్టాలే అన్నట్టుగా, నోరు మంచిగున్నోళ్లనే సర్పంచ్‌గా గెలిపించుకోవాలని, అప్పుడు గొడవలు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వీలైతే సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల్లో అడ్డగోలుగా డబ్బు ఖర్చు పెట్టొద్దని, ఆ పెట్టుబడులు తిరిగిరావడం కష్టం అని అభ్యర్థులకు ఉద్బోధించారు. సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికలంటూ యువకులు ఊర్లో తిరగొద్దని, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని.. ఐఏఎస్, ఎదగాలని హితబోధ చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల' బహిరంగ సభకు సీఎం రేవంత్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ.260.45 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. తనకు అనుభవం తక్కువైనా వివిధ హోదాల్లో పని చేశానని రేవంత్ అన్నారు. దేవుడు అవకాశం ఇవ్వడంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని, చిన్న వయసులోనే సీఎంగా విజయవంతంగా పని చేస్తున్నానని చెప్పారు. గత రెండేళ్లలో తాను ఏ రోజూ సెలవు తీసుకోలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిందని విమర్శించారు. అప్పట్లో విపక్షాలకు ఏనాడూ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. అలాంటి తప్పిదాలు జరుగకుండా తాము జాగ్రత్త పడుతున్నామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము సచివాలయానికి వెళ్తే వందల మంది పోలీసులను పెట్టి నిర్బంధించారని.. తనను, సీతక్కను మళ్లీ ఇంటి గేటు వద్దకు తీసుకెళ్లి పడేశారని విమర్శించారు. అలాంటి పరిస్థితులు ఇప్పుడు లేవని, తాము రానివ్వబోమని స్పష్టం చేశారు. ఎన్నికలొచ్చినప్పుడు మాత్రమే రాజకీయాలుంటాయని.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని సీఎం రేవంత్ అన్నారు. సోనియా గాంధీ ఆశీస్సులతోనే 60 ఏళ్ల తెలంగాణ కల సాధ్యమైందని చెప్పారు. అభివృద్ధి ప్రణాళికలను ప్రధాని దృష్టికి తీసుకెళతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొంటామని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో రక్షణ, విమానయాన శాఖల సహకారంతో విమానాశ్రయాన్ని నిర్మిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. ఎర్రబస్సు రావడమే గగనమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్‌బస్‌ను దింపుతామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే స్థానికంగా ఎన్నో పరిశ్రమలు ఏర్పడతాయని.. టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఉన్న పులులను చూసేందుకు దేశం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తారన్నారు. ఏడాది తిరిగేలోపే ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించి, పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని, నూటికి నూరు శాతం అభివృద్ధి చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఎక్కడైతే ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్, ఇరిగేషన్ అందుబాటులో ఉంటాయో ఆ ప్రాంతంలో అభివృద్ధి సాధ్యపడుతుందని సీఎం రేవంత్ అన్నారు. ఇంద్రవెల్లిలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పారు. గత రెండేళ్లలో 60వేల ఉద్యోగాలు ఇచ్చామని, త్వరలోనే మరో 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. మహిళలకు మునుపు ఎక్కడికి వెళ్లాలన్నా ఇంట్లో డబ్బులకు చేయి చాచే పరిస్థితి ఉండేదని.. ఇప్పుడు ఉచిత బస్సు సౌకర్యంతో ఆ పరిస్థితి తప్పిందన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలు సంతోషంగా ఉన్నారని, అందు కే ఈ ఏడాది భారీ వర్షాలు పడ్డాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని భావిస్తే, ఓ పెద్దాయన దెయ్యమై పట్టారని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ విమర్శించారు. లక్షన్నర కోట్లతో కాళేశ్వరం కట్టారని, మూడేళ్లలోనే అది కూలేశ్వరమై కూలిపోయిందని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును అక్కడి నుంచి తరలించి అన్నారం, సుందిళ్ల పేరిట కరీంనగర్ జిల్లాలో నిర్మించారని ఫలితంగా రూ.లక్ష కోట్ల నిధులు గోదావరిపాలయ్యాయని ఆరోపించారు. ఈ పాపం ఊరికే పోదని, ఇప్పుడు ఆ కుటుంబం ఎన్ని బాధలు పడుతోందో చూస్తున్నామన్నారు. ఎప్పుడైనా అక్రమ సంపాదన, ప్రజల సొమ్ము తిన్నోడెవడూ బాగుపడరని, అన్యాయపు సొమ్ము వస్తే కుటుంబాలు ప్రశాంతంగా ఉండవన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవేళ్లను నిర్మిస్తామని చెప్పారు.

# నేడు నర్సంపేటకు ముఖ్యమంత్రి రేవంత్

వరంగల్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబరు 4:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా నర్సంపేటలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రూ.531 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో నర్సంపేటకు రానున్న సీఎం.. రూ.200కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి భూమి పూజ నిర్వహిస్తారు. అలాగేరూ.130 కోట్లతో నిర్మించే మెడికల్ కాలేజీ భవనాలకు, రూ.25కోట్లతో నిర్మించే నర్సింగ్ కాలేజీ భవనాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. రూ.20 కోట్లతో నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో చేపట్టే సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులకు భూమి పూజ నిర్వహించనున్నారు. రూ.82.56కోట్లతో వరంగల్-నర్సంపేట నాలుగు లైన్ల రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు.అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు నర్సంపేట శివారులోని మెడికల్ కాలేజీ సమీపంలో జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారు. మరోవైపు సీఎంతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఉన్న విభేదాలు తొలిగినట్లేననే చర్చ జరుగుతోంది. మొదట్నుంచీ సీఎం రేవంత్‌తో మాధవరెడ్డికి విభేదాలున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా ఆయన ఏడాదికి పైగా సీఎంను కలవనే లేదు. రేవంత్ వరంగల్‌కు వచ్చిన సందర్భాల్లోనూ మాధవరెడ్డి దూరంగానే ఉ న్నారు. అయితే, ఇటీవల ఆయన తల్లి మృతి చెందడంతో సీఎం పరామర్శకు ఇంటికి రావటంతో ఇద్దరి మధ్య సయోధ్య కుదరిందనే టాక్ వినపడుతోంది. కాగా, రాష్ట్రంలో ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై ఈనెల 6న సీఎం రేవంత్ సమీక్షించనున్నారు. ఆయా ప్రాజెక్టులకు నిధులు, మూడేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టులపై ఇందులో చర్చించే అవకాశముంది.







# క్వాంటం సిటీగా హైదరాబాద్!

- దేశంలోనే తొలిసారిగా లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ ఆవిష్కరణ
- స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ఫండ్స్ ఆఫ్ ఫండ్స్‌ను ప్రారంభిస్తాం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- గచ్చిబౌలిలోని ఐఐఐటీ-హైదరాబాద్‌లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం, తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ'ని డిప్యూటీ సీఎం భట్టితో కలిసి ఆవిష్కరణ

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబరు 4:

'క్వాంటం సిటీ'గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ'ని రూపొందించామన్నారు. గచ్చిబౌలిలోని ఐఐఐటీ- హైదరాబాద్‌లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం, తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ'ని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయని, అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతోందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర టెక్నాలజీలలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ'లో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. క్వాంటం సెన్సింగ్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో పరిశోధనా, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమేకాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఈ టెక్నాలజీలో దేశానికి ఒక బెంచ్‌మార్క్‌ను ఏర్పాటు చేసేలా ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్‌కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు.

# కళాకారులకు ప్రాంతం ఉండదు..

- ఎస్పీ బాలు విగ్రహం ఏర్పాటుపై రాద్ధాంతం తగదు
- కులం, మతం లేకుండా బీజేపీ నేతలకు పూట గడవదు
- ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావద్దనే హిల్ట్: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబరు 4:

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం దేశం గర్వించదగిన గాయకుడని, రవీంద్రభారతిలో ఆయన విగ్రహం ఏర్పాటుపై రాద్ధాంతం చేయడం తగదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అసలు కళాకారులకు ప్రాంతాలు ఆపాదించడం సరికాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు భౌగోళికంగా విడిపోయినా.. తెలుగు వారంతా అన్నదమ్ముల్లా కలిసే ఉండాలని ఆకాంక్షించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కులం, మతం ప్రస్తావన లేకుండా బీజేపీ వారికి పూట కూడా గడవదని.. దేవుళ్ల గురించి ఒక సామెత రూపంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడితే దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని ఆక్షేపించారు. కులం, మతం పేరిట రాజకీయాలను తెలంగాణ ప్రజలు జీర్ణించుకోరన్నారు. అసలు అభివృద్ధి గురించి బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరానికి ఢిల్లీ తరహా పరిస్థితి రాకూడదనే హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ పాలసీతో హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గడంతో పాటుగా భూముల ధరలూ తగ్గి మధ్య తరగతి వారికి అందుబాటులోకి వస్తాయన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. హిల్ట్ పాలసీపై విమర్శలు చేయడం దారుణమని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్ల పాటు హైదరాబాద్‌ను అడ్డగోలుగా దోచుకుంటే.. అప్పుడు బీజేపీ వాళ్లు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఔటర్ రింగు రోడ్డు వెలుపల, లోపల ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టినప్పుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడ ఉన్నాడని నిలదీశారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో బీజేపీ, ఒకటేనని మరోసారి తేలిపోయిందన్నారు. అంతకుముందు రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మహేశ్ గౌడ్ నివాళులర్పించారు.

# హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం






### పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు

### బిఆర్ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం

### ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు

### జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించన కెటిఆర్

**హైదరాబాద్,డిసెంబర్ 3(నేటి ఫోకస్ న్యూస్):**
హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం

కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

# సైబర్ నేరగాళ్ల షాక్

### పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లు హ్యాక్

**హైదరాబాద్,డిసెంబర్ 3(నేటి ఫోకస్ న్యూస్)**
తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ÷ర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమ య్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**ఖమ్మం,డిసెంబర్ 3(నేటి ఫోకస్ న్యూస్):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో కొనసాగుతున్న రెండో విడత కొనసాగు తున్నస్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ పక్రియలో భాగంగా నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ విధానాన్ని నామినేషన్ దరఖాస్తుల ఆమె సమీక్షించారు.నామినేషన్ పక్రియ పారదర్శకంగా, దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు అవసరమైన సలహాలు,సూచనలు అధికారులు,సంబంధిత సిబ్బందికి ఇచ్చారు.అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాస్,ఎంపిఓ రవీంద్ర ప్రసాద్,గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# కోతుల సమస్యతో రైతుల పరేషన్

### జాతీయ సమస్యగా గుర్తించి చర్యలు తీసుకోవాలి

### లోక్‌సభలో ప్రస్తావించిన బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**న్యూఢిల్లీ,డిసెంబర్ 3(నేటి ఫోకస్ న్యూస్):**
కోతుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పెద్దమొత్తంలో వానరాలు పంటలను పాడు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను నివారించేందుకు జాతీయ స్థాయిలో కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కోతుల సమస్యపై గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమస్య తమ శాఖ కిందకు రాదని కొన్ని ప్రభుత్వ శాఖలు తప్పించుకుంటున్నాయని.. వానరాల సమస్య ఏ శాఖ కిందకు వస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కోతుల సమస్య చిన్న విషయంలాగా అనిపిస్తోందని.. కానీ అందరూ ఈ సమస్య గురించి తెలుసుకుని నవ్వుతారని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో కోతుల సమస్య ఉందని గుర్తుచేశారు. విషయంలో నోడల్ ఏజెన్సీ అవసరమని చెప్పారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కోతుల సమస్యను ప్రజలు ప్రస్తావిస్తున్నారని గుర్తు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కూడా ఈ సమస్య ఒక ఎజెండాగా మారిందని పేర్కొన్నారు. వానరాల సమస్యను పరిష్కరిస్తే సర్పంచ్‌గా గెలిపిస్తామని ప్రజలు అంటున్నారని.. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.

# పాతబస్తీలో యువకుడి దారుణ హత్య

### రియల్ వ్యాపారి జునైద్‌గా గుర్తింపు

**హైదరాబాద్,డిసెంబరు4(నేటి ఫోకస్ న్యూస్):**
హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి కత్తి పోట్లతో పడి ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు బాధితుడిని హుటాహుటిన సంతోష్‌నగర్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు పాతబస్తీ రెయిన్ బజార్‌కు చెందిన మహమ్మద్ జునైద్ (30)గా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన జునైద్‌ను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచారని.. తీవ్రంగా గాయపడిన జువైద్‌ను ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. అనంతరం జునైద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే నిందితులు, బాధితుడు ఇద్దరూ కూడా బంధువులే అని అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ తెలిపారు. జువైద్‌ను ఎందుకు హత్య చేశారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

# సాధారణ స్థితికి చేరుకుంటున్నాం

### విమానాల అంతరాయాన్ని సరిదిద్దుతున్నాం

### ఇండిగో విమానయాన సంస్థ తాజా ప్రకటన

**న్యూఢిల్లీ,డిసెంబర్4(నేటి ఫోకస్ న్యూస్):**
దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ప్రయాణ సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతున్నది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ ప్రకటించింది. అంతేకాదు, కేవలం గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది. ఢిల్లీ, ముంబై,హైదరాబాద్ సహా ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సంక్షోభం తలెత్తింది. మరోవైపు విమానాల రద్దు, ఆలస్యంపై ఇండిగో సంస్థ స్పందించింది. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించ నున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఈ మేరకు గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసింది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఏకంగా 250 నుంచి 300 విమానాలను సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో సంక్షోభం ఏర్పడింది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌పోర్ట్స్ వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రముఖ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది. అదే సమయంలో తాజా పరిస్థితిపై ప్రయాణికులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దఅశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ప్రధాని నరేంద్ర మోడీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ట్యాగ్ చేస్తూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 7 గంటలకు పైగా చిక్కుకుపోయిన ఓ ప్రయాణికుడు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళం తలెత్తినట్లు ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు 12 గంటలకు పైగా ఎటువంటి కన్ఫర్మేషన్ లేకుండా పడిగాపులు

పడుతున్నారని, ఇండిగో సిబ్బంది అబద్దాలు చెబుతూ జలగల్లా పీడిస్తున్నారని విమర్శించారు.

సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ పనితీరును డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బుధవారం ప్రశ్నించింది. నవంబర్‌లో 1,232 విమానాలు రద్దవడంతోపాటు విమానాల రాకపోకల సమయాల్లో జాప్యం జరిగింది. ఈ పరిస్థితిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి ఇండిగోతో కలిసి మదింపు చేస్తున్నట్లు తెలిపింది.

# బాలు విగ్రహాన్ని అడ్డుకోవడం దారుణం

### రోశయ్య, బాలసుబ్రమణ్యం ఒకప్రాంతం వారు కాదు

### బిఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలు ఆపాలి

### రోశయ్య వర్ధంతి సభలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్,డిసెంబర్ 3(నేటి ఫోకస్ న్యూస్):**
తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదనిమహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్ఎస్ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు పడ్డ కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు.

ఇకాగా.. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్

కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.

# వార్డు మెంబర్ గెలుపుకోసం నానా తంటాలు

### భార్యను గెలిపిస్తే ఫ్రీ కటింగ్ అంటూ ప్రచారం

**సిద్దిపేట,డిసెంబరు4(నేటి ఫోకస్ న్యూస్):**
తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఓట్ల పండగలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు కోతులను తరిమిస్తామని హామీ ఇవ్వగా, కొందరు రకరకాల హామీలు ఇస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని అన్ని పంచాయతీ, గ్రామ, వార్డు పరిధిలో ఎన్నికల హీట్ పెరిగిపోయింది. ప్రధాన పార్టీలు బలపరచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులు ప్రచారం హోరాహోరీగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లను ఆకర్షించేందుకు వివిధ రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నారు. డబ్బు పంచడం ఓ ఎత్తు అయితే.. కొందరు చీరలు, వివిధ రకాల వస్తువులను బహుమతిగా అందిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వార్డ్ మెంబర్ ఎన్నికల ప్రచారం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. తన భార్యను వార్డు మెంబర్‌గా గెలిపిస్తే.. ఐదేళ్ల పాటు ఫ్రీగా కటింగ్ చేస్తానని ఆమె భర్త ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది..

నా భార్యని వార్డ్ మెంబర్‌గా గెలిపిస్తే మగవారందరికీ కంటింగ్, షేవింగ్ ఫ్రీగా చేస్తానని ఓ భర్త వినూత్న ప్రచారం చేస్తున్నాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో ఓ మహిళ వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తోంది. ప్రస్తుతం అన్ని పంచాయతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్లు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ఈ క్రమంలో రఘోత్తంపల్లిలో వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తున్న మహిళ కూడా ప్రచారం మొదలెట్టింది. సదరు మహిళ భర్త క్షురకుడు కావడంతో ప్రచారం వినూత్నంగా మొదలెట్టాడు. తన భార్యను వార్డ్ మెంబర్‌గా గెలిపిస్తే.. వార్డులోని మగవారందరికీ ఐదేళ్ల పాటు కటింగ్ , షేవింగ్.. ఫ్రీగా చేస్తానని చెబుతున్నాడు. ఇంటింటికీ వెళ్లి ఈ ఆఫర్ చెబుతూ.. తన భార్యను గెలిపించాలని కోరుతున్నాడు. తడి వింత ఆఫర్ వినేందుకు వినూత్నంగా ఉండడంతో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

# బంగారం, వెండి ధరల్లో దూకుడు

### గరిష్టస్థాయికి చేరుకున్న ధరల పెరుగుదల

### బంగారంతో పోటీ పడుతున్న వెండి ధరలు

**న్యూఢిల్లీ,డిసెంబర్4(నేటి ఫోకస్ న్యూస్):**




దేశంలో పసిడి ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం కాస్తంత తగ్గిన ధరలు మళ్లీ విజృంభించాయి. వెండి ధర కూడా రికార్డు స్థాయికి చేరింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తున్న వైనం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతపై అంతకంతకూ పెరుగుతున్న ఆశలు గోల్డ్‌కు డిమాండ్ మరింతగా పెరిగేలా చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, భారత్‌లో గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,30,590గా ఉంది. నిన్నటి రేట్‌తో పోలిస్తే ఇది రూ.720 అధికం. 22 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ రేట్ కూడా రూ. 650 మేర పెరిగి రూ.1,19,710కు చేరుకుంది. ఇక పారిశ్రామిక డిమాండ్ అధికంగా ఉండటంతో వెండి ధరలూ రికార్డు స్థాయిని తాకాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.1,91,100 వద్ద జీవితకాల గరిష్ఠానికి చేరింది. ఏడాదిలో ఇప్పటివరకూ బంగారం ధరలు 40 శాతం మేర పెరిగాయని పరిశీలకులు చెబుతున్నారు. వచ్చే ఏడాది కూడా గోల్డ్ రేట్స్‌లో జోరు కొనసాగుతుందని గోల్డ్‌మన్ శాక్స్ రీసెర్చ్ తాజా నివేదికలో తేలింది. కేంద్ర బ్యాంకులు భారీగా పసిడి కొనుగోళ్లకు దిగడం, నెమ్మదిస్తున్న అమెరికా ఆర్థిక వృద్ధి, బలహీనపడుతున్న డాలర్ వంటివి పుత్తడికి డిమాండ్ పెంచుతున్నాయి. ఇక అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా కొత్త వ్యక్తిని ఎంపిక చేస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో వడ్డీ రేట్ కోతపై ఆశలు మరింత పెరిగాయి. ఫలితంగా బంగారం ధరలు మరింత ఎగబాకాయి. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాల నుంచి డిమాండ్ విపరీతంగా ఉండటం, సరఫరాలో తగ్గుదల వెరసి వెండి ధర ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకేలా చేశాయి. గతేడాదితో ధరలతో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధర ఇప్పటివరకూ సుమారు 101 శాతం మేర పెరిగింది.


# సమంతకు నిడుమోరు గృహంలోకి ఆహ్వానం

## ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్



అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. నిడిమోరు ఫ్యామిలీలోకి సమంతను ఆహ్వానిస్తూ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత- రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ఒకరిపై ఒకరికి గౌరవం, నిజాయతీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము' అని రాసుకొచ్చారు. ఈషా ఫౌండేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?




ప్రపంచ వ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు- ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణెళి పలు కారణాల వలన తప్పకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్.సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. 2000లో మిస్ వరల్డ్‌గా కిరీటాన్ని గెలుచుకున్న ప్రియాంక, తర్వాత హిందీ చిత్రాల్లో వరుస విజయాలు సాధించారు. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించారు. రామ్ చరణ్‌తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్‌తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్‌గా విడుదలైంది.

# ఐఎండీబీ పాపులర్ నటులు, దర్శకుల జాబితా

**సైయారా నటులు, దర్శకుడికి తొలిస్థానం**

**తెలుగు నుంచి చోటు దక్కించుకోని తెలుగు స్టార్స్**

సినిమాలకు సంబంధించి రేటింగ్ పరంగా అత్యంత విశ్వసనీయత కలిగిన ఆన్‌లైన్ వేదికగా పేరున్న ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ఐఎండీబీ ప్రతి ఏడాది సినిమాలతో పాటు తారలకు సంబంధించి వివిధ కేటగిరీలలో ప్రేక్షకాదరణ పొందిన జాబితాను ప్రకటిస్తున్నది. తాజాగా ఈ ఏడాది పాపులర్‌గా నిలిచిన తారల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలుగు నుంచి ఒక్కరు కూడా చోటు దక్కించుకోకపోవడం విశేషం. సైయారా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న బాలీవుడ్ యువ నటులు ఆహన్ పాండే, అనిత్ పడ్డా.. వరుసగా మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది. ఇక కూలీ కామియోతో మెరిసిన ఆమిర్ ఖాన్ ఈ ఏడాది మోస్ట్ పాపులర్ తారల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. హోమ్ బౌండ్ సినిమాతో మెప్పించిన ఇషాన్ ఖట్టర్ నాలుగవ స్థానంలో నిలువగా.. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సినిమాతో అలరించిన నటుడు లక్ష్య ఐదవ స్థానంలో దక్కించుకున్నాడు. రష్మిక మందన్నా ఆరో స్థానంలో నిలువగా.. లోక చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కళ్యాణి ప్రియదర్శన్ ఏడో స్థానం దక్కించుకుంది. ధడక్ సినిమాలో నటనకు గాను తృప్తి డిమ్రి ఎనిమిదో స్థానంలో నిలువగా.. రుక్మిణి వసంత్ 9వ స్థానం, రిషబ్ శెట్టి 10వ స్థానం దక్కించుకున్నారు

దర్శకుల జాబితాలో ఐఎండీబీ విడుదల చేసిన డేటా ప్రకారం ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులు ఎవరు అనేది చూసుకుంటే. సైయారాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులలో అగ్ర స్థానంలో నిలిచాడు. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌తో ఎంట్రీ ఇచ్చిన షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఈ ఏడాది రెండో స్థానంలో నిలిచాడు. కూలీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న లోకేష్ కనకరాజ్ మూడో స్థానంలో నిలువగా.. నిశాంఛీతో హిట్ అందుకున్న అనురాగ్ కశ్యప్ నాలుగో స్థానంలో, ఎల్ 2 ఎంపురాన్ సినిమాతో హిట్ అందుకున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఐదో స్థానంలో నిలిచారు. ఆమిర్ ఖాన్‌తో సితారే జమీన్ పర్ లాంటి సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ఆర్.ఎస్. ప్రసన్న ఆరో స్థానంలో నిలువగా.. మెట్రో ఇన్ డినోతో అనురాగ్ బసు ఏడో స్థానంలో నిలిచాడు. మలయాళం కొత్త లోక సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు డొమినిక్ అరుణ్ ఎనిమిదో స్థానంలో చోటు దక్కించు కోగా.. ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ 9వ స్థానం, హోమ్ బౌండ్ చిత్రంతో నీరజ్ ఘైవాన్ 10వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు.





## ఔట్‌పుట్ రావాలంటే..సమిష్టిగా పనిచేయాల్సిందే

**తాజాగా నటులు రానా, దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యలు**

# వర్కింగ్ అవర్స్‌తో సినిమా నడవదు

బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణెళి ఇటీవల వర్కింగ్ అవర్స్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. రోజుకు ఎనిమిది గంటల పని చాలు..అతిగా వర్క్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు అని ఆమె చెప్పిన మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆమెను 'స్పిరిట్', 'కల్కి 2' ప్రాజెక్టుల నుంచి తప్పించేశారని వచ్చిన వార్తలు మరింత వివాదాన్ని రేకెత్తించాయి. జీవితం-పని మధ్య బ్యాలెన్స్ చాలా అవసరం అని దీపిక చెప్పిన మాటలకి పలువురు సెలబ్రిటీలు ఆమెకు మద్దతు తెలిపారు. మనసు, శరీరం ఒత్తిడిలో ఉన్నప్పుడు మంచి అవుట్‌పుట్ సాధ్యం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు.

అయితే ఈ వివాదంపై నటుడు దగ్గుబాటి రానా తాజాగా స్పందించారు. సినిమా ఇండస్ట్రీ సాధారణ ఉద్యోగం కాదు. నటన ఒక లైఫ్‌స్టైల్. ఎనిమిది గంటలు కూర్చొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చే ఫీల్డ్ ఇది కాదని రానా వెల్లడించారు. ఒక మంచి సీన్ రావాలంటే కెమెరా నుంచి లైటింగ్ వరకు, నటీనటులు నుంచి టెక్నీషియన్ల వరకూ అందరూ సమయం పట్టించుకోకుండా అంకితభావంతో పని చేస్తారని ఆయన అన్నారు. ఇక్కడ 8 గంటల రూల్ ప్రాక్టికల్‌గా చాలా కష్టం అని స్పష్టం చేశారు. నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ఈ విషయంపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలలో వర్క్ మోడల్ ఒక్కో రకంగా ఉంటుంది. తెలుగులో మహానటి చేస్తున్నప్పుడు కొన్నిసార్లు సాయంత్రం ఆరు గంటలకే షూటింగ్ అయిపోయేది. తమిళంలో పరిస్థితి కొంచెం వేరుగా ఉంటుంది. ఆదివారాలు కూడా సెలవు ఇస్తారు. ఒక రోజు అతిగా పనిచేయడం కంటే, రోజూ కొంచెం అదనంగా పనిచేయడం బెస్ట్ అని దుల్కర్ స్పష్టం చేశారు. ఇండస్ట్రీ ధోరణి, ప్రాజెక్ట్ డిమాండ్స్ మీద వర్కింగ్ అవర్స్ ఆధారపడి ఉంటాయి అని ఆయన స్పష్టం చేశారు. మలయాళంలో షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదు.. ఇక తమిళంలో ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒక రోజు అదనపు షూటింగ్ కంటే.. రోజూ కొన్ని గంటలు అదనంగా పనిచేయడం సులువే కదా' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీపికా పదుకొణెళి వ్యాఖ్యలపై రానా,దుల్కర్ స్పందించడంతో సినీ పరిశ్రమలో వర్కింగ్ అవర్స్‌పై చర్చ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.

# ఐటమ్ సాంగ్‌లతో పూజ అదుర్స్

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ప్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది.

'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆ మె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుం టున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయి న్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.

**అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం**